
ప్రజాశక్తి

శుక్రవారం 20 డిసెంబర్ 2024

5

విజయనగరం



## విజయనగరంలో క్రికెట్ సందడి

### 21 నుంచి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

విజయ్ హజారే ట్రోఫీకి విజయనగరం వేదికకానుంది. టోర్నీలో భాగంగా గ్రూప్ - డి మ్యాచ్‌లు పివిజి రాజు కాంప్లెక్ (అకాడమీ), విజ్జీ స్టేడియం గ్రౌండ్‌లో ఈ నెల 21న ప్రారంభమై జనవరి 5 వరకు జరుగనున్నాయి. మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు. గురువారం స్థానిక విజ్జీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షెడ్యూల్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాంబాబు, కోచ్‌లు వర్మ, షర్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముసురేసింది

- జిల్లాలో పలుచోట్ల వర్షాలు
- వరి రైతులకు ఇబ్బందులు
- పెరిగిన చలితో ప్రజలకు అగచాట్లు

**ప్రజాశక్తి-విజయనగరం, వేపాడ**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా అంతటా ముసిరేయడంతో వాతావరణం బాగా చల్లబడింది. గురువారం జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. నూర్పులు ఉధృతంగా సాగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. జిల్లాలో మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో మరింత కలవర పడుతున్నారు.జిల్లా అంతటా వర్షాలు పడుతుండడంతో పంటలను కాపాడుకునే ఒదుకు అన్నదాతలు వ్యయ ప్రయాసలు పడుతున్నారు. ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లను అంది ంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ఆకాశం మేఘావృతమై చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తీవ్ర చలిగాలులు వీయడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.



కోసిన వరిచేనును కుప్పలు పెడుతున్న రైతులు



గజపతినగరం మండలం ముచ్చర్లలో పొలంలో చేరిన నీరు

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చాలాచోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా వేశారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.45లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు.ఇటీవల కురిసిన వర్షాలకు 1934 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. మళ్లీ అల్పపీడనం వల్ల వర్షాలు కురవడంతో రైతులు కలవరం చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 5.6మిల్లీమీటర్ల వర్షం కురిసింది. విజయనగరం, బొండపల్లి, గంట్యాడ, గజపతినగరం, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, జామి, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడలో స్వల్ప వర్షాలు కురిశాయి.

**భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

జిల్లాపై చలి పంజా విసురుతోంది. వర్షాల నేపథ్యంలో చల్లని గాలులు వీస్తుండటంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. గత వారం రోజులుగా పగటిపూట 22 నుంచి 23 డిగ్రీలు నమోదు కాగా, రాత్రి వేళల్లో 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు చలితో వణికిపోతున్నారు. రాబోయే మరో 20 రోజులు వరకు ఇదే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దీంతో పిల్లలు, వృద్ధుల్లో ఆస్తమా వంటి అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్నాయి.



వేపాడ మండలం జగ్గయ్యపేటలో వర్షానికి నానుతున్న వరిచేను కుప్పలు

## గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులకు పరిహారమివ్వాలని ధర్నా

**ప్రజాశక్తి-బొబ్బిలి**

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, రావివలస సర్పంచ్ సోమల కుమారి డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇవ్వాలని గురువారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రావివలస పంచాయతీలోని పెద్దచెలగాం రెవెన్యూ పరిధిలో ఐదుగురు గిరిజన రైతులకు చెందిన 11.42 ఎకరాలు భూమిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించినా, నష్టపరిహారం మాత్రం ఇవ్వలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి గిరిజనులు భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తే నష్టపరిహారం ఇవ్వకుండా భూములు తీసుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులతోపాటు సాగు చేస్తున్న విఆర్‌ఎ టి.సింహాచలానికి 2.30 ఎకరాలకు నష్టపరిహారం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొండకెంగువ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం రామభద్రపురం మండల కన్వీనర్ బలస శ్రీనివాసరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

## చండీఘర్ విద్యుత్తు రంగ ప్రయివేటీకరణను విరమించుకోవాలి

విద్యుత్తు ఉద్యోగుల జెఎసి ధర్నా

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**


చండీఘర్ విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు పరం చేయాలని చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు జెఎసి డిమాండ్ చేసింది. గురువారం జెఎసి ఆధ్వర్యంలో దాసన్నపేట విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి విజయనగరం సర్కిల్ విద్యుత్ జెఎసి చైర్మన్ సురగాల లక్ష్మణ్, కన్వీనర్ బండారు రాజేష్, ఉపాధ్యక్షులు పప్పల అప్పలస్వామి నాయుడు, పూసపాటి సీతారామరాజు, బికెవి ప్రసాదరావు, కో చైర్మన్ ఎల్.సత్యనారాయణ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ మద్దతుతో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు భారతదేశ విద్యుత్ రంగం ప్రైవేటీకరణు వేగవంతం చేసిందన్నారు. ఉత్తరప్రదేశ్ విద్యుత్ పంపిణీ రంగం తూర్పు, దక్షిణ ప్రాంతాన్ని ప్రైవేటీకరించే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బిజెపి బృందం ప్రారంభించిందన్నారు. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతాల విద్యుత్ రంగం యుటిలిటీని కూడా ప్రైవేటీకరించినట్లు ప్రకటించిందని తెలిపారు. ఈ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా సమ్మెకు పిలుపు ఇవ్వడంతో గోయెంకాకు అప్పగించే ప్రక్రియ కూడా ఆగిపోయిందన్నారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు.




విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

# పారిశుధ్య కార్మికులకు రుణాలు

### సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు వావా



సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు వావా

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు) లకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వావా అన్నారు. దరఖాస్తులను స్వయంగా తీసుకొని అధికారులే బ్యాంకులకు పంపాలని తెలిపారు. సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు వావా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు విధిగా పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. బ్యాంకు రుణాలకు ష్యూరిటీలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న పథకాలు, సామాజిక, విద్యా, ఆర్థిక పరమైన స్థితిగతులపై ఆరా తీశారు. పలు రకాల సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాలపై అడిగి తెలుసుకున్నారు. సఫారీ కర్మచారి కుటుంబ సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని ఆయన చెప్పారు. విధి నిర్వహణలో మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలన్నారు. వారికి అవసమైన దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్, నూనె తదితర సామాగ్రిని విధిగా అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. హెపటైటిస్ - బి వాక్సిన్ వేయించాలని, నిర్దేశిత సమయంలో వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల ఆదాయాలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్ళు, రేషన్ కార్డులను మంజూరు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిపిఒ వెంకటేశ్వరరావు, డిఇఒ మాణిక్యం నాయుడు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కర రావు, విజయనగరం, రాజాం, బొబ్బిలి, నెలిమర్ల మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, అప్పల నాయుడు, రామలక్ష్మి, అప్పల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దీపాలు వేసి పరువు కాపాడండి

- కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ఏకరువు
- డిగ్రీ కాలేజి నిర్మాణానికి వేణుగోపాలపురంలో 5 ఎకరాలు కేటాయింపు
- వ్యాపార, వాణిజ్య సంస్థలకు నీటి మీటర్లు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

వీధిలైట్లు వేసి తమ పరువు నిలబెట్టాలని నగర పాలక సంస్థ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో ఏకరువు పెట్టారు. గురువారం నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా జరిగిన జీరో అవర్‌లో ప్రధానంగా వీధిలైట్లు సమస్యలపై కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. 45వ డివిజన్ కార్పొరేటర్ సంతోషి మాట్లాడుతూ కెఎల్ పురంలో విద్యుత్ స్తంభాలు వేసి, వెలగని వీధి లైట్లు వేశారని, వాటి స్థానంలో కొత్తవాటిని వేయాలని కోరారు. కార్పొరేటర్లు అల్లు చాణక్య, పిన్నింటి కళావతి, గణపతి, బాలి పద్మావతి కూడా వీధిలైట్లు వేయాలని కోరారు. 18 వ డివిజన్ కార్పొరేటర్ ఎం.రమాదేవి మాట్లాడుతూ తమ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరారు.కో ఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదురుగా,ప్రకాశం పార్కు నుంచి రాజీవ్ స్టేడియం వైపు సాయంత్రం ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది, దీనిపై దృష్టి సారించాలని కోరారు.

**కమిషనర్‌పై కార్పొరేటర్ల ప్రశంసలు**

నగర పాలక సంస్థకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం పట్ల కౌన్సిలర్ నల్లనయ్యను కార్పొరేటర్లంతా అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**35 అంశాలకు కౌన్సిల్ ఆమోదం**

- ప్రధానంగా వాణిజ్య, వ్యాపార సంస్థలకు, షాపులు, రెస్టారెంట్లు, బహుళ అంతస్తులు, సినిమా హాల్స్, పరిశ్రమలకు, ప్రభుత్వ కార్యాలయాలకు నీటి మీటర్లు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటిని జనవరి 1 తేదీ నుంచి అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో పాటు వాటర్ చార్జీలు కూడా పెంచుతూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.
- నగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి నిర్మాణం కోసం వేణుగోపాలపురం వద్ద 5 ఎకరాలు స్థలం కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.
- 2024 ఏప్రిల్ నుంచి సాధారణ నిధులు నుంచి మంజూరైన పనుల్లో నేటికీ నేటికీ ప్రారంభం కాని వాటిని, బిపిఎస్ ద్వారా చేపట్టాల్సిన 4 పనులు రద్దు చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్‌లు పెంచుతూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.
- పారిశుధ్య కార్మికులకు బట్టలు, దుప్పట్లు, చీరలు, టవల్స్ కొనుగోలు చేసేందుకు రూ.9.50 లక్షలతో పెట్టిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

**నగర పాలక సంస్థ లోగో ఆవిష్కరణ**

నగర పాలక సంస్థకు లోగోను రూపకల్పన చేసి ఇవ్వాలని నగర పాలక సంస్థ కోరగా వివిధ రకాలు లోగోలు నగర ప్రజలు తయారు చేసి పంపించారు. వాటిలో ఎంపిక చేసిన లోగోను కౌన్సిల్ సమావేశంలో ఆమోదిస్తూ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల చేతులు మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, అన్ని విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# గంజాయి రవాణాపై పీడీ యాక్టు

### ఎస్‌పి వకుల్ జిందాల్

**ప్రజాశక్తి-వంగర/సంతకవిటి**

గంజాయి రవాణాకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వంగర, సంతకవిటి పోలీస్‌స్టేషన్లను ఆయన సందర్శించారు. పోలీసు స్టేషను పరిసరాలు, ప్రాపర్టీ రూం, లాకప్ సెల్స్, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బందితో మమేకమై, వారు నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, వినియోగం, విక్రయాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు వినియోగిస్తున్న మార్గాలను గుర్తించి, నిరంతర తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని వివరించారు. ఆకస్మికంగా డైనమిక్ వాహన తనిఖీలను ప్రతి రోజూ పది ప్రాంతాల్లో చేపడుతున్నామన్నారు.

ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులను ఎస్‌పి ఆదేశించారు. గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అందులో స్థానిక వ్యాపారులు, ప్రజలు, ఎంఎస్‌పిల సహకారం తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద కాషనరీ బోర్డులను, స్టాపర్స్, లైటింగ్ ఏర్పాటు చేసి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్‌బి సిఐ ఎ.వి లీలారావు, వంగర, సంతకవిటి, రేగిడి ఎస్‌ఐలు షేక్ శంకర్, ఆర్.గోపాలరావు, నీలావతి, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

# భవిష్యత్తులో అన్ని రంగాల్లోకి 'ఎఐ'

### మిరాకిల్ డిజిటల్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే లోకం మాధవి

**ప్రజాశక్తి-భోగాపురం**

ప్రపంచంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా కృత్రిమ మేధ (ఎఐ) భవిష్యత్తులో అన్ని రంగాల్లోని విస్తరిస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మండలంలోని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ సమ్మిట్-24 గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ కృత్రిమ మేధ ద్వారా రానున్న రోజుల్లో అనేక అవకాశాలను మన ముందు ఆవిష్కరింపజేస్తుందన్నారు. ప్రస్తుతం యువత ఆయా రంగాల్లో అవకాశాలను అందుపుచ్చుకోవాలని తెలిపారు. అందుకే మిరాకిల్ సంస్థ డిజిటల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మిరాకిల్ సిఇఒ లోకం ప్రసాద్ మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లోనూ దూసుకు వెళ్లాలన్నారు. ప్రపంచానికి ఉపయోగపడేలా కొత్త తరహా ఆవిష్కరణలు రూపొందించాలని కోరారు. దేశం నలుమూలల నుంచి వచ్చే నిపుణుల నుంచి నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. 2016 నుంచి ఇప్పటివరకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మిరాకిల్ ల్యాబ్ ప్రతినిధి లోకం చాణక్య, ప్రతినిధులు రవి విజ్జు, మిరాకిల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

## నేటి నుంచి ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

ఈనెల 20 తేదీ నుంచి జనవరి 19 వరకు ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రజా రవాణా అధికారి .సి హెచ్, అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 ముఖ్య పట్టణాలకు ఆర్‌టిసి ద్వారా డోర్ డెలివరీ సౌకర్యం ఉందన్నారు. ఈ మాసోత్సవాలను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమీప బుకింగ్ కౌంటర్ నుండి పది కిలోమీటర్ల వరకు 50 కిలోల బరువు గల పార్శిళ్లను ఇంటికే తెచ్చి అందజేస్తారని చెప్పారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## 21న దిశ కమిటీ సమావేశం

### కేంద్ర పథకాల అమలుపై సమీక్ష

**ప్రజాశక్తి-విజయనగరంకోట**

కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించే నిమిత్తం దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ సమావేశం) డిసెంబర్ 21న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరుగుతుందని జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ తెలిపారు.

## గిరిజన సమస్యలకు పరిష్కారం చూపండి

### కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రికి ఎమ్‌పి కలిశెట్టి వినతి

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

గిరిజన సమస్యలకు పరిష్కారం చూపాలని గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువెల్ ఓరంని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం పార్లమెంట్‌లో మంత్రిని కలిని వినతి అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో ఇంకా డోలి వ్యవస్థ నడుస్తోందని, చాలా ప్రాంతాల్లో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



కేంద్రమంత్రికి వినతి అందిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

## మోడల్ టెస్ట్ పేపర్లను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

యుటిఎఫ్ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టులలో నిపుణులైన ఉపాధ్యాయులతో తయారు చేసిన 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను గురువారం జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, ఉప విద్యాశాఖ అధికారి కెవి రమణ, అడిషనల్ డైరెక్టర్ గౌరీ శంకర్, సూపరింటెండెంట్ బాల భాస్కర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు ఉపయోగపడేలా తయారు చేసిన మోడల్ టెస్ట్ పేపర్లను చదివి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, ఎ.శంకర్రావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. రాంప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వాసుదేవరావు, జి.రమణ, వి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## టిబి నిర్మూలనకు కృషి : కలెక్టర్

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

వంద రోజుల టిబి ప్రచార, నిర్మూలనా కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 10 వాహనాల ద్వారా టిబి పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 779 టిబి క్యాంపులను నిర్వహించినట్లు వివరించారు. టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను కూడా అందజేస్తున్నామన్నారు. ఈ నెల 7న జిల్లా నుంచి ప్రారంభమైన టిబి ప్రచార కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విస్తతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. 100 రోజుల క్షయవ్యాధి ప్రచార, నిర్మూలనా కార్యక్రమం అమలుపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలీలా శ్రీవాత్సవ, అడిషనల్ సెక్రటరీ ఆరాధనా పట్నాయక్ , టిబి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఊర్వశి బి సింగ్, టిబి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ రావ్, ఇతర ఉన్నతాధికారులు గురువారం జాతీయస్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విసిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లాను క్షయ రహితంగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ కె.రాణి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో భూసమస్యల పరిష్కారం

## రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యేలు కోళ్ల , అదితి




శృంగవరపుకోట.. కొత్తూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

**ప్రజాశక్తి-శృంగవరపుకోట**

రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామస్థాయిలో భూమి తగాదాలు, రీ సర్వే అవకతవకలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు తమ సమస్యల ధ్రువపత్రాలు, దరఖాస్తులు తీసుకురావాలని, రశీదు ఇస్తారని చెప్పారు. 45 రోజుల్లో సమస్యల పరిష్కారం అవుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, రీసర్వే డిటి కీర్తన, విఆర్ఒ ఈశ్వరరావు, గుప్తా, టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, శివ, తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. మున్సిపాలిటీలో పాతబొబ్బిలిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలు, కుల, ఆదాయ, మరణ ధ్రువపత్రాలు సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సదస్సుకు 86మంది రైతులు హాజరుకాగా, 9 మంది సమస్యలపై దరఖాస్తు చేసినట్లు తహశీల్దార్ ఎం.శ్రీను చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**వేపాడ :** మండలంలోని గుడివాడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. సదస్సులో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, విఆర్ఒలు, ఎఎస్ఐ రాజు పాల్గొన్నారు.

**బొండపల్లి :** గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. గురువారం బి.రాజేరు గ్రామంలో సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఆర్ఐ హరికృష్ణ, ఉప సర్పంచ్ లచ్చిరెడ్డి జోగారావు, విఆర్ఒ గెద్ద నారాయణరావు పాల్గొన్నారు.

**విజయనగరం కోట :** గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం మలిచర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కొందరు రైతుల భూములు రీ సర్వేలో 22 ఎలోనూ, మరికొందరివి వన్ బి ఆన్‌లైన్ అప్‌లోడ్‌లోను, సరిహద్దు నిర్ణయాల్లోనూ తప్పులు చేశారని తెలిపారు. దీనివల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆర్‌డిఒ కీర్తి మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డి.అరుణ, తహశీల్దార్ కూర్మనాథం, సర్వేయర్ అప్పలనాయుడు, మలిచర్ల సర్పంచ్ రమా కుమారి, సుంకర పేట సర్పంచ్ సుంకరి రాజేశ్వరి, ఎంపిటిసి కొసర నిర్మల, ఆర్ఐ ఎస్ఎస్ఎన్ రాజు, విఆర్ఒ లక్ష్మణరావు, టిడిపి నాయకులు తుమ్మగంటి రామారావు, కొసర శివ ,వైసిపి నాయకులు తుమ్మగంటి బంగారు నాయుడు , మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు, పైడ్రాజు, వైసిపి నాయకులు టి.బంగారు నాయుడు, సుంకరి దుర్గరాజు, జనసేన నాయకులు పతివాడ రవి పాల్గొన్నారు.



విజయనగరంకోట.. మలిచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

**బాడంగి :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని కోడూరు గ్రామంలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రెడ్డి కృష్ణ, కొల్లి చిన్నంనాయుడు, కొల్లి సత్యారావు, మరిపి రమేష్ పాల్గొన్నారు.

### జిరాయితీగా సరిచేయాలి

**నెల్లిమర్ల :** జరజాపుపేటకు చెందిన జిరాయతీ భూములను దేవాదాయ శాఖ భూములుగా నమోదు చేశారని, వాటిని జిరాయతీగా సరిచేయాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు అధికారులను కోరారు. గురువారం జరజాపుపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నంబర్ 104, 107లో భూములు దేవాదాయ శాఖ భూములుగా నమోదు కావడం వల్ల రైతులు వాటిని అనుభవించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కొంతలవాని చెరువు ఆక్రమణకు గురైందని, వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుదర్శనరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టిడిపి నాయకులు అవునాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, కాళ్ల రాజశేఖర్, కాళ్ల సత్యవతి, జనసేన నాయకులు నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, తుమ్ము వెంకట రమణ, మద్దిల అప్పన్న, అవునాపు మురళీకృష్ణ, సర్వేయర్ దివ్య, విఆర్ఒలు సౌజన్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# కార్లలో గంజాయి రవాణా

## నలుగురు అరెస్టు.. పరారీలో ముగ్గురు



బొబ్బిలి.. వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-బొబ్బిలి, తెర్లాం**

ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్ తరలిస్తున్న 18.2 కిలోల గంజాయిను పోలీసులు పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ గంజాయి తరలిస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్‌కు సమాచారం రావడంతో డిఎస్‌పి పి.శ్రీనివాసరావుకు తెలియజేశారు. దీంతో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, తెర్లాం, రామభద్రపురం ఎస్ఐలు సాగర్ బాబు, వెలమల ప్రసాద్‌ను అప్రమత్తం చేశారు. తెర్లాం మండలం డి.గదబవలస వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో తరలిస్తున్న గంజాయిను సీజ్ చేశారు. ఒడిశాకు చెందిన బాలుడితోపాటు చందన్ అడ్కాటియను, హర్యానాకు చెందిన వీరేంద్ర సింగ్, సునీల్ రానా అరెస్టు చేసినట్లు డిఎస్‌పి శ్రీనివాసరావు చెప్పారు. బాలుడిని జువైనల్ కోర్టుకు తరలించి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపించామని తెలిపారు. గంజాయి తరలిస్తున్న వారిలో సునీల్ అడ్కాటియ, కృష్ణ పాంగి, భణ్వారి పరార్‌లో ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి గంజాయి, రెండు కార్లతో పాటు రూ.12 వేలు, నాలుగు మొబైల్స్ సీజ్ చేశామన్నారు. చాకచక్యంగా గంజాయిను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన రామభద్రపురం ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్ విష్ణును డిఎస్‌పి అభినందించారు. గంజాయి కేసు దర్యాప్తులో తెర్లాం డిటి సత్యనారాయణ, విఆర్ఒలు రాము, బలరాం పాల్గొన్నారు.

**బొడ్డవర చెక్‌పోస్టు వద్ద గంజాయి పట్టివేత**

**శృంగవరపుకోట :** మండలంలోని బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న గంజాయిని శృంగవరపుకోట పోలీసులు గురువారం పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. గంజాయి రవాణా వెనుక ఉన్న వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు**

**విజయనగరం కోట :** నగరంలోని రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్ఐ వి. బాలాజీ రావు తెలిపారు. ఫ్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తుండగా హర్యానా రాష్ట్రానికి చెందిన కుషన్‌షిబ్ (19) రాయగడ నుంచి తిరుపతికి రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకొని, అతని నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విజయనగరం, పార్వతీపురం , బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వే స్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు.

# రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

**ప్రజాశక్తి-చీపురుపల్లి**

చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్‌డిఒ సత్యవాణి తెలిపారు. చీపురుపల్లి మండలంలో 3, గరివిడి-3, గుర్ల-5, మెరకముడిదాం-5, రాజాం-6, రేగిడి ఆమదాలవలస-7, సంతకవిటి-5, వంగర-5 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ల భర్తీకి 18వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్‌డిఓ సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. వీటి భర్తీకి జనవరి 5వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆయా మండలాల తాహశీల్దార్ల ద్వారా ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేయాలని సూచించారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి, వయసు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పోస్టులను రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, రాత పరీక్ష కోసం ఈ నెల 31న హాల్ టిక్కెట్లను జారీ చేస్తామని తెలిపారు. ఖాళీలు, రిజర్వేషన్ తదితర వివరాలకు సంబంధిత మండల తాహశీల్దార్ కార్యాలయం లేదా ఆర్‌డిఒ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

**రేగిడి :** మండలంలో ఖాళీగా ఉన్న ఏడు రేషన్ డిపోల డీలర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ ఎన్.చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. పుర్లి (ఎస్‌టి), ఆడవరం (ఒసి), పెద్ద శిర్లాం (బిసి మహిళ), బూరాడ (ఇడబ్ల్యూఎస్), కందిశ (ఒసి మహిళ), కొత్త చెలికాని వలస (ఎస్‌సి), లచ్చారాయపురం (బిసి-ఎ)లో డీలర్ల పోస్టులు భర్తీచేస్తున్నట్లు వెల్లడించారు. స్థానికులై, 18 నుంచి 40 ఏళ్ల వారు దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు.

**పూసపాటిరేగ :** మండలంలోని చల్లవానితోట, చోడమ్మ అగ్రహారం, గుంపాం పంచాయతీల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న మూడు చౌకధరల దుకాణాలకు డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహశీల్దార్ తాడ్డి గోవింద ఒక ప్రకటనలో తెలిపారు.. చల్లవాణితోట (ఎస్‌టి మహిళ), చోడమ్మ అగ్రహారం (ఒసి మహిళ), గుంపాం (బిసి-బి)లో డీలరు పోస్టులు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాసై, స్థానిక పంచాయతీ నివాసిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో విజయనగరంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఈ నెల 23వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**మెరకముడిదాం :** మండలంలో రాచగుమడాం, శాతంవలస, గర్భాం-1, బుదరాయవలస, కొర్లాంలో రేషన్ డిపోల డీలర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ అజు రఫీజ్ తెలిపారు. అభ్యర్థులకు వచ్చే ఏడాది జనవరి ఐదో తేదిన చీపురుపల్లిలోని జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

**శృంగవరపుకోట :** శృంగవరపుకోట పంచాయతీలో రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సిఎస్ డిటి ఎల్.వి.జయలక్ష్మి తెలిపారు. పంచాయతీలో 213 (ఇడబ్ల్యుఎస్), 214 (ఎస్‌సి), 215 (ఒసి) నంబర్ల రేషన్ షాపుల్లో డీలర్లను నియమిస్తున్నట్లు చెప్పారు.

### నిబంధనల మేరకే రిజర్వేషన్

**బొబ్బిలి :** ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ షాపు డీలర్ల పోస్టుల భర్తీకి రిజర్వేషన్ అమలు చేస్తున్నామని ఆర్‌డిఒ రామ్మోహనరావు చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ డివిజన్‌లో 30 డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, కొన్ని గ్రామాల్లో కోర్టులో కేసు వేశారన్నారు. కోర్టులో కేసు ఉన్న పోస్టులు కాకుండా, మిగిలినవి భర్తీ చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 667 వినతులు రాగా, ఇప్పటి వరకు 40 పరిష్కరించామని చెప్పారు. ఎల్‌పి నంబర్లు, కుల ధ్రువీకరణ, మ్యుటేషన్, విస్తీర్ణంలో తేడా, గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు, భూ రికార్డుల్లో మార్పులు, వక్ఫ్, అటవీ, దేవాదాయ శాఖ భూముల సమస్యల పరిష్కారం కోసం ఆయా అధికారులతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. డూప్లికేట్ 1బి, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు కూడా వెంటనే ఇస్తున్నామని చెప్పారు.

బాడంగి, గజపతినగరం మండలాల్లో సర్వే రాళ్లపై జగన్ బొమ్మలను తొలగిస్తున్నామని తెలిపారు. రోజుకు 5 వేల సర్వే రాళ్లపై ఉన్న బొమ్మలను తొలగించేందుకు లక్ష్యం ఇచ్చినట్లు చెప్పారు.

## ఎపిజివిబిలో మార్పునకు సహకరించాలి

**27లోపు అత్యవసర లావాదేవీలు పూర్తి చేసుకోవాలి : ఆర్‌ఎం**

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్‌ఎస్) ఆదేశాల మేరకు ఇక నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే పరిమితం కానున్నాయని ఎపిజివిబి రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకుతో విలీనం అవుతాయని తెలిపారు. ఈ విభజన క్రమంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28 నుంచి 31 వరకు అన్ని శాఖలలో బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. ఖాతాదారులు తమ అత్యవసర లావాదేవీలను ఈనెల 27లోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.

## వివాదాస్పద భూముల పరిశీలన

**ప్రజాశక్తి-రామభద్రపురం**

మండలంలోని తారాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న పాత చెక్కర ఫ్యాక్టరీకి సంబంధించిన వివాదాస్పద భూమిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ రామ్మోహనరావు, తహశీల్దార్ సులోచనరాణి గురువారం పరిశీలించారు. తారాపురానికి చెందిన కొంత మంది రైతులు వివాదాస్పద భూమిపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తారాపురం గ్రామానికి చెందిన నాగులకొండ కుటుంబానికి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు మధ్య ఈ భూవివాదం కొన్నేళ్లుగా సాగుతోంది. దీనిపై ఇప్పటికే తహశీల్దార్ సులోచనారాణి విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. అయితే ఆ నివేదిక సమగ్రంగా లేదని నాగులకొండ కుటుంబానికి ఫిర్యాదు చేయడంతో ఆర్‌డిఒ ఆధ్వర్యాన మళ్లీ విచారణ చేపట్టాలని ఆదేశాలు రావడంతో పునపరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ అక్కిన శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 24న స్థాయీ సంఘాల సమావేశం

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు డిసెంబర్ 24వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని సిఇఒ సత్యనారాయణ వెల్లడించారు.

## నకిలీ మస్తర్లు వేస్తే చర్యలు

**ప్రజాశక్తి-రామభద్రపురం**

ఉపాధి హామీ పనుల్లో నకిలీ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని ఎపిఒ త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని ఇట్లామామిడిపల్లిలో ఉపాధి హామీ పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పనికి వచ్చిన వేతనదారులకు మాత్రమే మస్తర్లు వేయాలని సూచించారు. పనులకు రాని వారికి మస్తర్లు వేస్తే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతీ వేతనదారుడికి రోజుకు రూ.300కు తక్కువ కాకుండా కూలి వచ్చేలా పనులు చేయాలని, ముఖ్యంగా టాస్కులు పూర్తిచేయాలని సూచించారు.

## ఇళ్ల మంజూరుకు గ్రామాల్లో సర్వే

**ప్రజాశక్తి-రామభద్రపురం**

నూతన గృహాల మంజూరుకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని హౌసింగ్ డిఇ ఎలియాజర్ అప్పయ్య తెలిపారు. మండల హౌసింగ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీని కోసం భార్య, భర్తల ఆధార్ కార్డు తీసుకొని సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా పేర్లు ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. గతంలో నిర్మించిన ఇళ్ల నిర్మాణాల బిల్లులు కూడా వేగవంతం చేస్తున్నామన్నారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో 10,864 ఇళ్లు మంజూరు చేస్తే, 7,347 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు వివరించారు. ఇప్పటివరకు మొదలు పెట్టని ఇళ్లను మాత్రం రద్దుచేశామని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని లబ్ధిదారులను సూచించారు.

## హాస్టల్‌ను మార్చాలని నిరసన

**ప్రజాశక్తి-బొబ్బిలి**

కోమటిపల్లిలో ఉన్న బిసి బాలుర కళాశాల హాస్టల్‌ను పట్టణానికి మార్చాలని విద్యార్థి, యువజన జెఎసి అధ్యక్షులు బి.సాయికిరణ్ డిమాండ్ చేశారు. పట్టణానికి హాస్టల్‌ను మార్చాలని కోరుతూ గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు నిరసన చేపట్టారు. పట్టణంలో జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కోమటిపల్లి నుంచి రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. పట్టణంలో హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి

**ప్రజాశక్తి-బొబ్బిలి**

పిల్లలు చెడు మార్గంలో నడవకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో గురువారం యానాదుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. మాదకద్రవ్యాలకు పెద్దలు, పిల్లలు దూరంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ కాలనీపై నిఘా పెట్టామని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధులు

## చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి-వేపాడ**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. అనంతరం లింగ వివక్షతపై ఎన్ఆర్‌పురం, చినగుడిపాల గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎల్‌ఎంపి స్వామి నాయుడు, ఎంఎంటిఎల్ వసంత, ఎంటి సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జి నారాయణమ్మ, ఐసిఆర్‌పిలు దేవుడు, వెంకటరావు పాల్గొన్నారు.

## అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

**ప్రజాశక్తి-బొబ్బిలి**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని నిర్మించి ప్రపంచంలో భారతదేశానికి మంచి గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తిని అవమానించడం సరికాదని పేర్కొన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## 21న డప్పు కళాకారులు, చర్మకారుల సమావేశం

**ప్రజాశక్తి-మెంటాడ**

ఈ నెల 21న గజపతినగరం ఎస్‌బిఐ బ్రాంచి ఎదురుగా ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద డప్పుకళాకారులు, చర్మకారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాకోటి రాములు, లింగాల వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డప్పు కళాకారులు, చర్మకారులు హాజరు కావాలని కోరారు.

## సిబిఎం పాఠశాలను రెన్యువల్ చేయాలి

**ప్రజాశక్తి-బొబ్బిలి**

సిబిఎం బాలికోన్నత పాఠశాల గుర్తింపును రెన్యువల్ చేయాలని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాస్, పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ డిఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాఠశాల గుర్తింపు రెన్యువల్ కాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారుతుందని చెప్పారు.

## పవన్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

**ప్రజాశక్తి-బొబ్బిలి**

సాలూరు నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికేందుకు కూటమి కార్యకర్తలు తరలిరావాలని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి ఒక ప్రకటనలో కోరారు. వై జంక్షన్ గాంధీ విగ్రహం వద్దకు రావాలని సూచించారు.



ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ హేమంత్‌కుమార్

## రీసర్వే ప్రారంభం

**ప్రజాశక్తి-తెర్లాం**

గత ప్రభుత్వ హయాంలో మండలంలో పలు గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టిన విషయం తెలిసిందే. మిగతా గ్రామాల్లో గురువారం రీసర్వే ప్రక్రియను తహశీల్దార్ హేమంత్‌కుమార్ ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని పనుకువలస, జగన్నాథవలస పంచాయతీల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో తహశీల్దార్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. రీసర్వేపై నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులకు వివరించారు. మండల సర్వేయర్ వి.సాయి కుమార్, విఆర్‌ఒలు, సర్వేయర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సోమిదవలస, గోపాలవలస, డి.గదబవలస సర్పంచులు చందక సత్యనారాయణ, జి.వెంకట్రావు, జావాన రమేష్ నాయుడు, ఎంపిటిసి బి.శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

## బానాదిలో పశువైద్య శిబిరం

**ప్రజాశక్తి వేపాడ**

మండలంలోని బానాది గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పశువులకు తనిఖీలు చేసి, 20 దూడలకు వ్యాక్సిన్ వేసినట్లు ఎడి చలపతిరావు తెలిపారు. అనంతరం ఆర్‌ఎస్‌కెలో రికార్డులు తనిఖీ చేశారు. పశుగ్రాసం సాగు కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

## మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాశక్తి-డెంకాడ**

జాతీయ మహిళ కమిషన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, జాతీయ మహిళా కమిషన్ ద్వారా శిక్షణ పొందిన న్యాయవాదులు హాజరయ్యారు. సీనియర్ న్యాయవాది పివి వరలక్ష్మి మహిళలకు సంబంధించిన చట్టాలు ముఖ్యంగా గృహ హింస చట్టం, మనోవర్తి ,మహిళ పట్ల జరుగుతున్న లైంగిక అత్యాచారాలకు సంబంధించిన చట్టాలు, బాల్యవివాహాలు గుడ్ టచ్ బాడ్ టచ్, మహిళలకు ఆస్తిలో హక్కు కు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. మరొక సీనియర్ న్యాయవాది ఎవిఎల్ పద్మజ మాట్లాడుతూ మహిళలకు ఏ సమస్య వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు. డెంకాడ తాహశీల్దార్ వి.పద్మావతి మాట్లాడుతూ రెవెన్యూ చట్టాల గురించి తెలిపారు. వ్యవసాయ శాఖ ఎడి ఎ.నాగభూషణం మాట్లాడుతూ వ్యవసాయదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు గురించి వివరించారు. కార్మిక శాఖ అసిసెంట్ కమిషనర్ జి. ఎల్లాజీ రావు ఇ-శ్రమ కార్డుల గురించి తెలిపారు. కార్యక్రమంలోపలుశాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జాతీయ మహిళా కమిషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగులను న్యాయ అవగాహన సదస్సుకు వచ్చిన మహిళలకు అందజేశారు.



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆదినారాయణ

## చెల్లూరులో జోరుగా అభివృద్ధి పనులు

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

మండలంలోని చెల్లూరు గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెల్లూరు సర్పంచ్ కల్లిపిల్లి ఆదినారాయణ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రహదారులు, కాలువల వ్యవస్థను బాగు చేయడానికి కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామంలో రూ.48 లక్షలతో ఐదు సిసి రోడ్లు నిర్మించామన్నారు. రెండు వందల ఇరవై మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 40 మీటర్లు, 35మీటర్లు రోడ్లు వేయడంతో పాటు కాలువలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

## 'సీతం'లో అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-విజయనగరం**

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - సివిల్ సర్వీసెస్ గురించి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేజర్ ఎస్‌పి ఎస్.ఒబెరాయ్ విచ్చేసారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో యుపిపిఎస్‌సి నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్ష ద్వారా జిల్లా పరిపాలనాధికారిగా, రాష్ట్రానికి ప్రధాన అధికారి అవ్వొచ్చని తెలిపారు. యుపిఎస్‌సి పరీక్ష ఒక్క ఐఎఎస్ కోసమే కాదని, చాలా విభాగాలకు సంబంధించి అధికారుల నియామకానికి సంబంధించినది కూడా అని వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - సివిల్ సర్వీసెస్ ఎంతో అత్యున్నత స్థానాలని అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి పాల్గొన్నారు.

# రైతులకు టార్పాలిన్లు పంపిణీ

**ప్రజాశక్తి-నెల్లిమర్ల**



రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న జెడి రామారావు

వర్షాలకు పంట తడవకుండా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నారు. గురువారం మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు వరి పంటను పరిశీలించి, రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను హెచ్చరిక నేపథ్యంలో రైతులు కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ వెయ్యి టార్పాలిన్లు సమకూర్చినట్లు తెలిపారు. మండలానికి 32 టార్పాలిన్లు వచ్చాయని చెప్పారు. నూర్పిడి చేసిన ధాన్యం వర్షానికి తడవకుండా రైతులు టార్పాలిన్లు ఉపయోగించి, కొనుగోలు పూర్తి అవ్వగానే ఆర్‌ఎస్‌కెలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ ఎం.పూర్ణిమ, ఎఇఒ ఎం.నాగరాజు, టి.హేమామహేష్, విఎఎ శివప్రసాద్, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## తాబేళ్ల మృత్యువాత



ముక్కాం తీరానికి కొట్టుకొచ్చిన భారీ తాబేలు కళేబరం

**ప్రజాశక్తి-భోగాపురం**

సముద్రతీరంలో వందల సంఖ్యలో తాబేళు మృత్యువాత పడుతున్నాయి. తాజాగా గురువారం సాయంత్రం ముక్కాం, చేపలకంచేరు తీరానికి ఎనిమిది తాబేళ్ల కళేబరాలు కొట్టుకొచ్చాయి. సుమారుగా 20 రోజుల నుంచి ఇదేవిధంగా తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకొస్తున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారు 28 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. టేకు వలలకు చిక్కుకొని, పెద్దబోట్లకు తగలడం వల్ల ఇవి మృత్యువాత పడుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు.